గురువులను గౌరవించడం మన సంస్కృతి


నటుడు విక్రమ్‌కు పురస్కారాన్ని అందజేస్తున్న ఎస్.వేణుగోపాలచారి తదితరులు

గన్‌ఫౌండ్రీ: గురువులను గౌరవించడం మన సంస్కృతి అని కేంద్ర మాజీ మంత్రి ఎస్.వేణుగోపాలచారి అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో భారత్‌ఆర్ట్స్ అకాడమి ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురు వందనం పేరిట సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రస్తుత సమాజంలో గురువులను గౌరవించే సంస్కృతి తగ్గిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం పలువురు గురువులకు గురు రత్న పురస్కారాలు, పిల్లలకు అభ్యుదయ పురస్కారాలను ప్రదానం చేశారు. అంతకు ముందు చిన్నారుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సినీ నటుడు విక్రమ్ ఆదిత్యారెడ్డి, ప్రముఖ నృత్య గురువు పసుమర్తి శేషుబాబు, నృత్య గురువు రమాదేవి, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు లయన్ లలిత రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సేవా దృక్పథం కలిగి ఉండాలి


అవార్డు గ్రహీతలతో వకుళాభరణం కృష్ణమోహన్‌రావు తదితరులు

గన్‌ఫౌండ్రీ: ప్రతి ఒక్కరూ సామాజిక సేవా దృక్పథాన్ని కలిగి ఉండాలని తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో మెగా సిటీ నవకళావేదిక ఆధ్వర్యంలో భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య 164వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో సేవలందిస్తున్న పలువురికి విశ్వేశ్వరయ్య మెమోరియల్ అవార్డులను ప్రదానం చేశారు. అంతకు ముందు సినీ సంగీత విభావరి ఆహూతులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో సరస్వతి ఉపాసకులు దైవాజ్ఞశర్మ, ఎన్‌సీఈఆర్‌టీ అడిషనల్ డైరెక్టర్ ప్రొఫెసర్ డీకె.రెడ్డి, సీనియర్ న్యాయవాది డీఎల్.పాండు, సంఘం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఎస్.సుధీర్‌కుమార్, సంస్థ వ్యవస్థాప అధ్యక్షులు మల్లికార్జున్‌రావు, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

రసాభాసగా ముగిసిన ఎన్నిక



లంగర్‌హౌస్: లంగర్‌హౌస్ దసరా ఉత్సవ సమితి నూతన కమిటీ ఎన్నిక రసాభాసగా సాగింది. దీంతో పెద్దలు ప్రస్తుతం ఎన్నిక వాయిదా వేశారు. వివరాల్లోకి వెళితే..దసరా సందర్భంగా గోల్కొండ కోట వద్ద, లంగర్‌హౌస్ రాంలీలా మైదానంలో పెద్దయెత్తున దసరా ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. చుట్టు పక్కల మండలాలలో ఉండే గ్రామాల ప్రజలు కూడా ఈ ఉత్సవాల్లో పాల్గొనే వారు. 2024 సంవత్సరానికి సంబంధించి ఈ సంవత్సరం కూడా వేడుకల నిర్వహణ ఎస్సీ వర్గానికి చెందిన అధ్యక్షుడితోనే చేయాలని పెద్దలు నిర్ణయించారు. ఆదివారం సంగం రాంలీలా మైదానంలో ఎన్నిక నిర్వహించేందుకు పెద్దలతో పాటు వివిధ బస్తీలవాసులు పాల్గొన్నారు. అధ్యక్ష పదవి ఏకగ్రీవం చేసే ప్రయత్నం చేయగా చిన్నాన్న, పెద్దనాన్న కుమారులు పోటీపడ్డారు. ఒకే కుటుంబం వారు కావడంతో సంధి కుదిర్చే ప్రయత్నం చేశారు. చివరకు ఎన్నిక లేదా చీటి వేసి డ్రా తీయడానికి ప్రయత్నించగా ఏకాభిప్రాయం కుదరక రసాభాసగా మారింది. దీంతో రెండు రోజుల తర్వాత ఎన్నిక నిర్వహిస్తామని, అంతలో మీరు ఏకాభిప్రాయానికి రావుంటే తమ నిర్ణయమే చివరిదని పెద్దలు చెప్పి సమావేశాన్ని వాయిదావేశారు.

భారీ వర్షాలకు నష్టపోయిన వారిని ఆదుకుంటాం


టోలిచౌకీ టూమ్స్ రోడ్డులో పర్యటిస్తున్న ఎమ్మెల్యే

గోల్కొండ: భారీ వర్షాలకు నష్టపోయిన వారిని ఆదుకుంటామని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. ఆదివారం ఆయన కార్వాన్ నియోజకవర్గంలోని కార్వాన్, టోలిచౌకీ, నానల్‌నగర్, గోల్కొండ డివిజన్లలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన వర్షానికి దెబ్బతిన్న రోడ్లు, వరద నీటితో నిండుగా ఉన్న నాలాలు, చెరువులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. శాతం చెరువు భారీ వర్షాలకు పూర్తిగా నిండిందని దీన్ని వల్ల నదీమ్ కాలనీ లోతట్టు ప్రాంతాల వారికి నష్టం వాటిల్లకుండా తగిన చర్యలు తీసుకున్నామన్నారు. చెరువు తూముకు మరమ్మతులు చేసి నీటిని భారీగా వదులుతున్నామన్నారు. అదే విధంగా టోలిచౌకీ చౌరస్తాలో వర్షం కురిసిన ప్రతిసారి వ్యాపార సముదాయాలతో పాటు భవనాల సెల్లార్లలో వరద నీరు చేరుతుందని ఆయన అన్నారు. దీన్ని నివారించడానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించేలా బల్దియా కమిషనర్‌తో పాటు అధికారులను కోరడం జరిగిందన్నారు. టోలిచౌకీ చౌరస్తా, ఎండీలైన్స్, నానల్‌నగర్ మెయిన్ రోడ్డు, సాలార్‌జంగ్ కాలనీ తదితర ప్రాంతాల్లోని ప్రధాన రహదారులు వరద నీటికి బాగా దెబ్బతిన్నాయన్నారు.

అల్లూరి సత్యవాణికి బెస్ట్ ఇంజినీరింగ్ అవార్డు



అబిడ్స్: టీజీఎస్‌పీడీసీఎల్ అధికారిని అల్లూరి సత్యవాణికి బెస్ట్ ఇంజినీరింగ్ అవార్డు లభించింది. విద్యుత్‌శాఖలో 20 ఏళ్లకు పైగా ఉత్తమ విద్యుత్ సేవలందిస్తున్న మెగా సిటీ నవకళావేదిక వారు ఆదివారం ఆమెకు అవార్డు అందజేసి సత్కరించారు. ఇంజినీర్స్ డే సందర్భంగా అల్లూరి సత్యవాణికి ఘన సత్కారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..అవార్డు లభించడం తనకెంతో సంతోషంగా ఉందన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు నిత్యావసర సరుకుల పంపిణీ


సరుకులు పంపిణీ చేస్తున్న శ్రీధర్‌రెడ్డి, దేవర శ్రీనివాస్ తదితరులు

గోల్కొండ: భారత ప్రధాని నరేంద్రమోదీ జన్మదినాన్ని భారీ ఎత్తున నిర్వహిస్తూ సేవా కార్యక్రమాన్ని చేపడుతున్నామని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఆదివారం గుడిమల్కాపూర్‌లో సేవా పక్వాడా కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య కార్మికులకు ఆయన నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలను ఆదుకోవడంలో బీజేపీకి మరేపార్టీ సాటిరాదన్నారు. భారీ వర్షాలకు ఈ సంవత్సరం తెలంగాణ రైతులు ఎంతో నష్టపోయారని వారి కన్నీటి గాథలను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకు వెంటనే ముందుకు వచ్చిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవర శ్రీనివాస్, బీజేపీ గోల్కొండ జిల్లా అధ్యక్షుడు పాండుయాదవ్, బీజేపీ కిసాన్ మోర్చా గోల్కొండ జిల్లా అధ్యక్షులు రావుల మాణిక్‌ప్రభు, అన్నీయాదవ్, రాజేందర్ డిగాన్, ముక్క కృష్ణగుప్తా, సుధాకర్‌యాదవ్ తదితరులున్నారు.



పూర్వ విద్యార్థుల సమ్మేళనం

చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్టలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2007–08 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. తమకు పాఠశాలు నేర్పి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దిన ఉపాధ్యాయులు మల్లేష్, నారాయణ, శ్రీవాటి శ్రీనాథ్, వెంకట్ స్వామి, రామారావు, సమీర్, రాఘవేందర్, రాధాశర్మ, రజినీలను విద్యార్థినీ, విద్యార్థులు మెమొంటో, శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కె.వినోద్ కుమార్, కృష్ణ, తాహేర్, సతీష్, నరేశ్, జయంత్, ప్రకాశ్, కల్పన, స్రవంతి, సాయి, జ్యోతి, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఓ వైపు విజ్ఞానం.. మరోవైపు ఆహ్లాదం..



ఆకట్టుకుంటున్న సాలార్‌జంగ్ మ్యూజియం పచ్చందాలు

సందర్శకులకు కనువిందు చేస్తున్న 3 ఎకరాల్లోని గార్డెన్



చార్మినార్: పాతబస్తీలోని సాలార్‌జంగ్ మ్యూజియం అటు విజ్ఞానంతో పాటు ఆహ్లాదాన్ని పంచుతోంది. మ్యూజియంలోని గ్యాలరీల్లో ఉన్న అద్భుత కళాఖండాలు విజ్ఞానాన్ని అందిస్తుండగా..సాలార్‌జంగ్ మ్యూజియం ప్రాంగణంలోని గార్డెన్ సందర్శకులను మంత్రముగ్ధులను చేస్తుంది. విజ్ఞాన అంశాలు సహా మదిదోచే అందాలతో సాలార్‌జంగ్ మ్యూజియంలోని గార్డెన్ ఆహ్లాదకరంగా కనిపిస్తుంది. సాలార్‌జంగ్ మ్యూజియం దాదాపు 10 ఎకరాల్లో విస్తరించి ఉండగా.. అందులో 3 ఎకరాల్లో గార్డెన్ ఉంది. సాలార్‌జంగ్ మ్యూజియాన్ని సందర్శించడానికి వస్తున్న సందర్శకులకు మ్యూజియం ప్రాంగణంలోని పచ్చని ఆహ్లాదకరమైన వాతావరణం ఆహ్వానం పలుకుతుంది. ఎటు చూసినా ఆకు పచ్చని చెట్లు, మొక్కలు ఆకట్టుకుంటున్నాయి. దూర ప్రాంతాల నుంచి సాలార్‌జంగ్ మ్యూజియంకు వచ్చే సందర్శకులు మ్యూజియం ప్రాంగణంలోని గార్డెన్‌లో కాసేపు సేదతీరి విశ్రాంతి పొందుతున్నారు. మ్యూ జియం లోపలికి అడుగిడిన వెంట నే గార్డెన్ అందాలు ఆహ్లాదనిస్తూ కనిపిస్తుంటాయి.




సాలార్‌జంగ్ మ్యూజియం ఆవరణలోని ఆహ్లాదకరమైన గార్డెన్

నేడు చలో లేబర్ కమిషనర్ ఆఫీస్

గోల్కొండ: భవన నిర్మాణ కార్మికులకు కార్డు ద్వారా ఇచ్చే లేబర్ ఇన్సూరెన్స్ బెనిఫిట్స్‌ను ప్రైవేటు కంపెనీలకు అప్పజెప్పడం సరికాదని సీఐటీయూ నాంపల్లిజోన్ కార్యదర్శి సి.మల్లేష్ అన్నారు. ఆదివారం టోలిచౌకీ, గుడిమల్కాపూర్ తదితర ప్రాంతాల్లోని లేబర్ అడ్డాల వద్ద నేడు జరిగే చలో లేబర్ కమిషనర్ కార్యాలయం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లేబర్ ఇన్సూరెన్స్ బెనిఫిట్స్‌ను కార్మిక వెల్ఫేర్ బోర్డు పరిధిలోనే ఉంచాలన్నారు. ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పజెప్పడం వల్ల అవినీతి చోటు చేసుకునే అవకాశం ఉందన్నారు. దీన్ని కోసం నేడు జరిగే చలో లేబర్ కమిషనర్ ఆఫీస్ కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కృష్ణ, రాములు, వీరేశం, నాగరాజు, నర్సింహారెడ్డి తదితరులున్నారు.

వరదనీటి సమస్యల పరిష్కారానికి చర్యలు


వరదనీటి ప్రాంతాల్లో పర్యటిస్తున్న కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్

యాకుత్‌పురా: వరదనీటి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని రెయిన్‌బజార్ కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్ అన్నారు. ఆదివారం సాయంత్రం ఆయన డివిజన్‌లోని యాకుత్‌పురా రైల్వేస్టేషన్, ఎస్ఆర్టీ కాలనీ, బడాబజార్, రెయిన్‌బజార్ చమన్, ఈస్ట్ చంద్రానగర్, మౌలా కా చీల్లా, ముర్తుజా నగర్ తదితర ప్రాంతాల్లో నాయకులు, జీహెచ్ఎంసీ మాన్‌సూన్ సిబ్బందితో కలిసి పర్యటించారు. రోడ్లపై నిలిచిన వరద నీటి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



గన్‌ఫౌండ్రీ: శ్రీ సరదా నృత్య నికేతన్ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. కూచిపూడి డ్యాన్స్ షో పేరిట వివిధ అంశాలపై చేసిన నృత్య ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. బృందావన్ నిలయం, శివ శకటం, రామాయణ శపథం వంటి నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో దూరదర్శన్ డిప్యూటీ డైరెక్టర్ జనర్ ఎన్‌వీ రమణ, వనపర్తి ఎస్పీ, ఆర్.గిరిధర్, స్వరమహతి కళాపరిషత్ వ్యవస్థాపక అధ్యక్షులు ఆదిత్య కిరణ్, సంస్థ డైరెక్టర్ శైలజ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నవ్య నాటక సమితి వార్షిక సంచిక ఆవిష్కరణ


వార్షిక సంచికను ఆవిష్కరిస్తున్న వసుంధర

నాంపల్లి: నవ్య నాటక సమితి, తెలంగాణ సంగీత నాటక అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 49వ జాతీయ స్థాయి సంగీత, నృత్య పోటీల కార్యక్రమంలో భాగంగా ఆదివారం రాత్రి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో ప్రత్యేకంగా రూపొందించిన 'వార్షిక సంచిక'ను ఆవిష్కరించారు. ముఖ్యఅతిథులుగా రాష్ట్ర ఖజానా, గణాంకాల శాఖ ఉప సంచాలకురాలు జి.వసుంధర, ప్రముఖ నృత్య గురువు డాక్టర్ కళాకృష్ణ, గౌరవ అతిథులుగా ప్రముఖ సంగీత విద్వాంసులు వాసా గోపీనాథరావు, తెలుగు విశ్వవిద్యాలయం సంగీత శాఖ శాఖాధిపతి డాక్టర్ రాధా సారంగపాణి, డాక్టర్ నందూరి రామకృష్ణమాచార్య సాహిత్య పీఠం అధ్యక్షులు కె.సాగరరావు, డాక్టర్ నందూరి విద్యారణ్య స్వామి హాజరయ్యారు. ప్రముఖ నృత్య గురువులు నిష్ఠల సుధామాల, డాక్టర్ ఇందిరాహేమ కార్యక్రమ సమన్వయకర్తలుగా వ్యవహరించారు. ముందుగా నవ్యనాటక సమితి అధ్యక్షుడు వేమరాజు విజయ్‌కుమార్ సభకు స్వాగతం పలికారు. అఖిల భారత సంగీత నృత్య పోటీల నేపథ్యాన్ని ఆయన వివరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ కళాకృష్ణ మాట్లాడుతూ..నవ్య నాటక సమితి ఆరున్నర దశాబ్దాలుగా సాంస్కృతిక రంగానికి చేస్తున్న సేవను కొనియాడారు. వసుంధర మాట్లాడుతూ..కళ–కృషి, సాధనల స్వయంవరమని అన్నారు.

మాలలు ఐక్యంగా ఉండాలి


ఎమ్మెల్యే వివేక్ వెంకట స్వామి, నాగరాజును సన్మానిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

గన్‌ఫౌండ్రీ: మాలలను అన్ని రాజకీయ పార్టీలు తక్కువగా అంచనా వేయడం సరికాదని ఎమ్మెల్యే వివేక్ వెంకట్‌స్వామి అన్నారు. ఆదివారం గన్‌ఫౌండ్రీలోని పర్వాన హాల్‌లో తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆఫ్ మాల ఆధ్వర్యంలో మాల, మాల ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఎస్సీ వర్గీకరణ అంశంలో జ్యుడిషియల్ కమిటీ వేస్తేనే అన్నివర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. మాల సంఘాలు అన్ని ఐక్యంగా ఉన్నప్పుడే మన హక్కులను సాధించుకోవచ్చునని పేర్కొన్నారు. వర్ధన్న పేట ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ..అంబేడ్కర్ ఇచ్చిన ఫలాలను ఆస్వాదిస్తున్నామని తిరిగి సమాజానికి ఎంతో కొంత వెనక్కి ఇవ్వాలని సూచించారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రవీంద్ర మాట్లాడుతూ..నవంబర్ 10న హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభను నిర్వహించి మాలల బలాన్ని చాటి చెబుతామని తెలిపారు. ఈ సమావేశంలో అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ డి.నిరంజన్, ప్రతినిధులు బాలరాజు, సర్వయ్య, డాక్టర్ అర్జున్, రాజు తదితరులు పాల్గొన్నారు.

'ఐటీ, పరిశ్రమల రంగాన్ని నాశనం చేసిన ఘనత కేటీఆర్‌దే'


మాట్లాడుతున్న గౌరీ సతీష్

అఫ్జల్‌గంజ్: తెలంగాణలో ఐటీ, పరిశ్రమల రంగాన్ని నాశనం చేసిన ఘనత మాజీ మంత్రి కేటీఆర్‌కే దక్కుతుందని టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్ పేర్కొన్నారు. పదేళ్లపాటు అధోగతికి గురైన పరిశ్రమలు, ఐటీ శాఖను దేశంలో అగ్రగామిగా మంత్రి డి.శ్రీధర్‌బాబు అభివృద్ధి చేస్తుంటే మాజీ మంత్రి కేటీఆర్ జీర్ణించుకోలేక అసత్య విమర్శలు చేస్తున్నారన్నారు. కేటీఆర్ పదేళ్లలో ఎలాంటి ప్రగతి సాధించలేదన్నారు. పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ప్రపంచ స్థాయిలో పర్యటించి పలు అంతర్జాతీయ కంపెనీలను తెలంగాణకు రప్పిస్తున్న ఘనత శ్రీధర్‌బాబుదే అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఐటీ, పర్యాటకం, పరిశ్రమల రంగాలలో అగ్రగామిగా ముందుకు పోతుందన్నారు. అభివృద్ధి చెందుతున్న తెలంగాణను చూసి బీఆర్ఎస్ తట్టుకోలేక పోతుందన్నారు. పరిశ్రమలు, పెద్ద పెద్ద కంపెనీలు వేలాది మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబుపై మంత్రి కేటీఆర్ విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు.

పురస్కారాల ప్రదానం


పద్మావతికి పురస్కారాన్ని అందజేస్తున్న పలువురు వక్తలు

గన్‌ఫౌండ్రీ: సమాజంలో పురస్కారాలు బాధ్యతలు పెంచడంతో పాటు ఇతరులకు స్ఫూర్తిని కలిగిస్తాయని పలువురు వక్తలు అన్నారు. తిరుపతి సిటీ చాంబర్ 27వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్రపతి అవార్డు గ్రహీత పి.పద్మావతికి ఉగాది పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..30 ఏళ్లగా నాటక కళ, సేవా రంగాల్లో సేవలను గుర్తించి పురస్కారాన్ని ఇవ్వడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు అయూబ్‌ఖాన్, కేఎస్.వాసు, స్వరాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు


సభ్యత్వ నమోదులో రాష్ట్ర సీనియర్ నాయకుడు మురళీధర్ దేశ్‌పాండే

యాకుత్‌పురా: హిందూస్థానీ ఆవామ్ మోర్చా (సెక్యులర్) పార్టీ యాకుత్‌పురా నియోజకవర్గం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆదివారం యాకుత్‌పురా పార్టీ కార్యాలయంలో ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా హాజరైన పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకుడు మురళీధర్ దేశ్‌పాండే కార్యక్రమాన్ని ప్రారంభించి పలువురి పేర్లు నమోదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..త్వరలో నియోజకవర్గంలోని డివిజన్ల వారీగా కమిటీలు ఏర్పాటు చేసి పార్టీని మరింత విస్తరింప చేస్తామన్నారు. రాష్ట్ర నాయకులు నర్సింహారావు, శ్రీధర్, అవ్వా నర్సింహారావు, శ్రీనివాస్, సురేందర్, రాజుచారి, మహ్మద్ జఫర్, సురేష్ పాల్గొన్నారు.

సన్మానం


ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను సత్కరిస్తున్న పోల్కం శ్రీనివాస్

అబిడ్స్: ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మేరు యువజన సంఘం అధ్యక్షుడు, రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి పోల్కం శ్రీనివాస్ ఘనంగా సన్మానం చేశారు. ఆదివారం లక్డీకాపూల్‌లోని ఓ హోటల్‌లో జరిగిన బీసీ సంక్షేమ సంఘం సమావేశంలో పోల్కం శ్రీనివాస్ పాల్గొని ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా పోల్కం శ్రీనివాస్ మాట్లాడుతూ..బీసీలకు మరిన్ని మంత్రుల శాఖలు ఇవ్వాలని పేర్కొన్నారు.

దత్తాత్రేయనగర్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు



అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గంలోని దత్తాత్రేయనగర్ డివిజన్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఆదివారం బీజేపీ నాయకులు రమేష్, పద్మారావు, రాజ్‌కుమార్, సీహెచ్ శ్రీధర్, రాఘవేందర్, గణేష్, చంద్రమోహన్‌ల ఆధ్వర్యంలో సభ్యత్వం చేపట్టారు.

తేజస్‌కు స్వర్ణం



జియాగూడ: 68వ స్కూల్స్ గేమ్స్ ఫెడరేషన్ ఇంటర్ స్కూల్ డిస్ట్రిక్ లెవల్ రైఫిల్ షూట్ టోర్నమెంట్, సెలక్షన్ 2024–25లో అండర్ 14 పిస్తోల్ విభాగంలో జియాగూడ విద్యశ్రీ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న దర్పల్లి తేజస్ గోల్డ్‌మెడల్ సాధించి మొదటి స్థానంలో నిలిచాడు. తన గెలుపునకు సహకరించిన వ్యక్తిగత కోచ్ అల్లూరి ప్రసన్నకుమార్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆదివారం స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ తెలంగాణ ఆధ్వర్యంలో నాంపల్లిలోని మదీన పబ్లిక్ స్కూల్‌లో ఈ నెల 21 నుంచి 22 వరకు జరిగిన రైఫిల్ షూటింగ్ కాంపిటేషన్ కమ్ సెలక్షన్‌లో గెలుపొందిన విజేతలకు హైదరాబాద్ రైఫిల్ షూటింగ్ ఫిజికల్ డైరెక్టర్ జోసెఫ్ జొనాల్డ్ మెడల్స్, సర్టిఫికెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..యువత షూటింగ్ విభాగంలో ఆసక్తి కనబరచాలని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ఫిజికల్ డైరెక్టర్ విజయశేఖర్, అనితరెడ్డి, వెంకటలక్ష్మి, కోచ్‌లు సయ్యద్ అబ్రార్ హుస్సేన్, సహస్ర శ్రీ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో వృద్ధురాలి మృతి



చాంద్రాయణగుట్ట: వృద్ధాశ్రమంలో అనారోగ్యంతో మృతి చెందిన వృద్ధురాలి సంబంధీకులెవరైనా ఉంటే తమను సంప్రదించాలని ఫలక్‌నుమా పోలీసులు తెలిపారు. ఎస్సై నాగరాజు కథనం ప్రకారం..రక్షాపురం ప్రాంతంలో ఈ 20న రోడ్లపై తిరుగుతున్న ముత్తమ్మ(60)ను ఫలక్‌నుమాలోని ఫాతిమా వృద్ధాశ్రమం నిర్వాహకుడు మహ్మద్ అబ్దుల్ వాసిఫ్ చేరదీసి ఆశ్రమంలో చేర్పించాడు. పేరు మాత్రమే చెప్పిన ఆమె తన వివరాలు ఏ మాత్రం వెల్లడించలేకపోయింది. 21న ఉదయం 11 గంటలకు బెడ్‌పై కదలిక లేకుండా ఉన్న ఆమెను పరిశీలించగా, అప్పటికే మృతిచెందింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు, ఈమె సంబంధీకులెవరైనా ఉంటే పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

రోడ్లన్నీ బురదమయం

- ఇళ్లు, హోటల్స్, షాపుల్లోకి చేరిన వర్షపు నీరు
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు


టోలిచౌకీలో రహమత్ హోటల్‌లో చేరిన వర్షపు నీరు


నిజాం కాలనీ షాదీఖానాలో బురదను తొలగిస్తున్న సిబ్బంది

గోల్కొండ: భారీ వర్షానికి గుడిమల్కాపూర్, మెహిదీపట్నం, మాసాబ్‌ట్యాంక్, టోలిచౌకీ తదితర ప్రాంతాల్లోని ప్రధాన రహదారులన్నీ జలమయమయ్యాయి. వర్షం నీటితో కొట్టుకువచ్చిన ఇసుక, బురదతో రోడ్లన్నీ బురదమయంగా మారాయి. గుడిమల్కాపూర్ ప్రధాన రహదారిపై ఆదివారం సాయంత్రం వరకు బురద నీరు మేటవేసి ఉంది. మరోవైపు టోలిచౌకీ నిజాం కాలనీలోని ఇళ్లు, హోటల్స్, షాపుల్లోకి వర్షపు నీరు భారీగా చేరింది. షాదీఖానాలు, వ్యాపార సముదాయాల్లో సైతం వర్షపు నీటితో పాటు రంగు మారిన డ్రైనేజీ నీరు కూడా భారీగా చేరింది. అదే విధంగా మెహిదీపట్నం, సరోజిని ఆసుపత్రి, అహ్మద్‌నగర్ తదితర ప్రాంతాల రోడ్లపై సైతం బురద చేరి రాకపోకలకు అంతరాయం కలిగిస్తుంది. గోల్కొండ డివిజన్‌లోని జిన్సీ బజార్, రేతిగల్లీ తదితర ప్రాంతాల్లో రోడ్లపై వర్షపు నీరు ఇంకా తగ్గలేదు. టోలిచౌకీ డివిజన్‌లోని టోలిచౌకీ చౌరస్తా, నదీమ్ కాలనీ తదితర ప్రాంతాల్లో భారీగా వర్షపు నీరు చేరింది. లిమ్రా గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో భారీగా వర్షపు నీరు చొచ్చుకొని వచ్చింది. వర్షపు నీటితో వచ్చిన బురద షాదీఖానాలోని మెయిన్‌హాల్‌లో అలాగే ఉండిపోయింది. అదే విధంగా రహమత్ హోటల్, రుమాన్ హోటల్‌తో పాటు టోలిచౌకీ చౌరస్తాలోని వ్యాపార సముదాయాలు, షాపుల్లో సైతం వర్షపు నీరు నింకా నిలిచి ఉంది.

కదలని అధికార యంత్రాంగం..

టోలిచౌకీ, గోల్కొండ డివిజన్‌లలో వర్షం సృష్టిస్తున్న బీభత్సంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. కార్వాన్‌లోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల కోసం జరిగిన తవ్వకాలు వర్షానికి బురదమయంగా మారాయి. టూంబ్స్ రోడ్డు, కంపెనీ బాగ్, ఎండిలైన్స్ తదితర ప్రాంతాల్లో పైపులు వేయడానికి తవ్విన గుంతల్లో వర్షపు నీరు చేరింది. ఆ ప్రాంతాలలోని బురదమయంగా మారడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అయితే ప్రజల ఇబ్బందులను మాత్రం అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. గుడిమల్కాపూర్ డివిజన్ టోలిచౌకీ చౌరస్తా, మెహిదీపట్నం బస్టాప్ తదితర ప్రాంతాల్లో వర్షపు నీరు సృష్టిస్తున్న బీభత్సం అధికారులకు తెలిసిన కూడా సహాయక చర్యలు చేపట్టడంలో అధికారులు విఫలమవుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. వర్షపు నీరు తమ షాపుల్లో ప్రతి యేటా చేరుతున్న కూడా దానిని నివారించేందుకు అధికారులు మాత్రం ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని వ్యాపారులు, హోటల్స్ నిర్వాహకులు అంటున్నారు.